


# చంపిందెవరు?

## భూతద్దం భాస్కర్ నారాయణ

**ఆహా:** మార్చి 22
**తారాగణం:** శివ శంకర్, రాశి సింగ్, అరుణ్ కుమార్ తదితరులు
**దర్శకత్వం:** పురుషోత్తం రాజ్

థియేటర్‌లో మంచి టాక్ తెచ్చుకున్న సినిమాలు ఓటీటీలోనూ అదే రేంజ్‌లో హిట్ అవుతున్నాయి. అందులోనూ డిటెక్టివ్ సినిమాలంటే ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతుంటారు. ఇన్వెస్టిగేటివ్ సినిమాగా తెరకెక్కిన 'భూతద్దం భాస్కర్ నారాయణ' ఇప్పుడు ఓటీటీలో రికార్డు స్ట్రీమింగ్ నమోదు చేసుకుంటున్నది. బాక్సాఫీస్ కలెక్షన్ల మాట ఎలా ఉన్నా... ఆహా ప్రేక్షకులను మాత్రం అలరిస్తున్నది. కథలోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్- కర్ణాటక సరిహద్దు అడవిలో వరుసగా హత్యలు జరుగుతుంటాయి. మృతదేహాల తలను మొండెం నుంచి వేరు చేసి అడవిలో పడేస్తుంటాడు హంతకుడు. మృతుల వేలిముద్రలు కూడా దొరక్కుండా చేతివేళ్లను కాల్చేస్తుంటాడు. మరోవైపు హతుల గురించి ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో చనిపోయింది ఎవరో పోలీసులకు అంతుచిక్కదు. ఈ కేసులను ఛేదించడానికి ప్రైవేట్ డిటెక్టివ్ భూతద్దం భాస్కర్ (శివ శంకర్) రంగంలోకి దిగుతాడు. ఒకవైపు కేసు పరిశోధనలో ఉండగానే.. వరుసగా హత్యలు జరుగుతుంటాయి. చనిపోయిన వారంతా హిజ్రాలని తేలుతుంది. ఇంతకీ హంతకుడు ఎవరు? హిజ్రాలనే ఎందుకు టార్గెట్ చేశాడు? భూతద్దం భాస్కర్ డిటెక్టివ్ ఎందుకు అవ్వాలనుకున్నాడు? ఈ కేసును అతను పరిష్కరించాడా లేదా అన్నది మిగిలిన కథ!













# యంగెస్ట్ లచ్చిందేవి!

**యువత** అనుకోవాలే గానీ ఈ భూమ్మీద ఏదైనా సాధించి తీరుతారనేది జగమెరిగిన సత్యం. ఉక్కు నరాల యువత బాణం ఎక్కుపెడితే ఎంతటి లక్ష్యమైనా వారి పాదాక్రాంతం కావాల్సిందే. వ్యాపార రంగంలో కాకలు తీరిన వారికేనా... కుబేరులన్న పేరు మాకెందుకు ఆ బిరుదు అతీతం అనుకున్నారో ఏమో అత్యంత సంపన్నుల జాబితాలో యుక్త వయసులోనే చేరిపోయారు. ఇంకా ఆసక్తికరం ఏమంటే ఆ యువ బిలియనీర్లందరిలో టీనేజ్ యువతి మొదటి స్థానం పొందడం! ఔను, ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కురాలైన బిలియనీర్‌గా ఓ 19 ఏండ్ల బ్రెజిల్ విద్యార్థిని తన పేరును సుస్థిరం చేసుకున్నది. ఆమెతోపాటే చాలామంది యువ వారసులు ఇటీవల ఈ కోటీశ్వరుల వరుసలో చేరిపోయారు. 2024 ఫోర్బ్స్ బిలియనీర్స్ జాబితా ప్రకారం.. బ్రెజిల్‌కు చెందిన 19 ఏండ్ల విద్యార్థిని లివియా వోయిగ్ట్ ప్రపంచంలో అత్యంత పిన్న వయస్కురాలైన బిలియనీర్ టైటిల్‌ను సాధించింది. లివియా నికర ఆదాయం విలువ 1,10 కోట్ల డాలర్లు. వయసులో తన కన్నా రెండు నెలలు పెద్దయిన క్లెమెంట్ డెల్ వెచియోను అధిగమించి ఈ స్థానాన్ని పొందింది లివియా. ఈమె ప్రస్తుతం బ్రెజిల్‌లోని విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తూనే.. లాటిన్ అమెరికాలోని ప్రముఖ ఎలక్ట్రికల్ మోటార్ల తయారీ కంపెనీ వెగ్ (WEG) భాగస్వాముల్లో అతిపెద్ద వాటాదారుగా కొనసాగుతున్నది. ఈ కంపెనీ వ్యవస్థాపకుల్లో లివియా వోయిగ్ట్ తాత వెర్నర్ రికార్డో వోయిగ్ట్ భాగస్వామిగా ఉండటం గమనార్హం. 2024లో అత్యంత చిన్న వయసు బిలియనీర్ జాబితాలో చేరిన మొదటి ఏడుగురిలో లివియా అక్క డోరా వోయిగ్ట్ డి అస్సిస్ కూడా ఉండటం విశేషం.



# మళ్లీ ప్రేమ పాఠాలు

**అసలు** ఉందో లేదో అన్నట్టుగా ఉన్న తన పిడికెడంత నడుము ఒంపుల్లో పోరగాళ్లందరినీ గింగిరాలు తిప్పేసింది ఇలియానా. ఈ గోవా బ్యూటీ నడుం అందాలను చూసి మనసు పారేసుకోని పోరగాడు లేడంటే నమ్మండి. తనదైన అందం, అభినయంతో సినీ ప్రేక్షకులందరూ తనతో ప్రేమలో పడేలా చేసిన ఈ చిట్టి నడుము చిన్నది తాను మాత్రం యూఎస్‌కు చెందిన మైఖేల్ డోలన్‌తో ప్రేమలో పడింది. కొంతకాలం ప్రేమించుకున్న ఈ జంట 2023లో పెండ్లి పీటలెక్కడం, వీరి ప్రేమకు గుర్తుగా అదే ఏడాది చివరిలో ఓ బుడ్డోడు పుట్టడం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం తన కొడుకు కోవా ఫీనిక్స్ డోలన్, భర్త డోలన్‌తో ఆనందంగా జీవితం గడుపుతున్న ఇలియానా ఇటీవల ప్రేమ గురించి చెప్పిన పాఠాలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి. ప్రేమ పాఠాలు అనగానే ఏవేవో ఊహించుకోకండి. ఆమె చెప్పింది స్వీయ ప్రేమ గురించే సుమా! ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆమె చెప్పిన స్వీయ ప్రేమ ముచ్చట్లు ఆసక్తిగా ఉన్నాయి. తన భాగస్వామితో కలిసి పనిచేస్తున్నట్టు చెప్పిన ఇలియానా డోలన్‌ను ఉద్దేశిస్తూ 'ఎప్పటికీ ఉత్తమమైన వ్యక్తి' అని ట్యాగ్ చేసింది. స్వీయ నియంత్రణతో గుండె పగలకుండా ఆపడం ఎలాగో రాసి ఉన్న ఓ పేజీని షేర్ చేసింది. దురుసుగా ప్రవర్తించడం మంచిదికాదని, వ్యక్తిత్వం కోల్పోయే పరిస్థితి తెచ్చుకోకూడదని చెప్పుకొచ్చింది. మనల్ని మనం ప్రేమించుకోకపోతే మనల్ని ప్రేమించలేని వ్యక్తులకు లోకువ కాక తప్పదని హెచ్చరించింది. సో, ఈ కందిరీగ నడుం సుందరి చెప్పినట్టు మిమ్మల్ని మీరు ప్రేమించుకోవడం ఇప్పుడే మొదలుపెట్టండి. అలా కొన్నాళ్లు పోతే దాని ఫలితం మీకే తెలుస్తుంది! అన్నట్టూ.. ఇలియానా త్వరలో ఓ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో వెండితెరపై మళ్లీ కనిపించనుంది. 'దో ఔర్ దో ప్యార్' పేరుతో తెరకెక్కిన ఈ సినిమాలో విద్యాబాలన్, ప్రతీక్ గాంధీ, సెంథిల్ రామమూర్తి కూడా నటించారు. శీర్షా గుహా ఠాకుర్తా దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రం ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకు రానున్నది.



తీసినవి ఒకట్రెండు సినిమాలే! సంగీతం కూర్చింది ఒకట్రెండు చిత్రాలకే!! రాసింది ఒకట్రెండు పాటలే!! పాడింది ఒకట్రెండు గీతాలే!! కానీ, వాటితోనే ఒక ట్రెండు సృష్టించారు కొందరు. ఆ ట్రెండ్ సెట్టర్స్ హిట్స్‌ను గుర్తు చేసుకోవడానికి ప్రత్యేకమైన సందర్భంతో పనిలేదు. కొత్త ఏడాదిలోకి ప్రవేశిస్తున్న తరుణంలో పాతలోని వింతల్ని స్మరించుకుంటే.. ఉగాది పచ్చడిలో తీపి తగిలినంత ఆనందంగా ఉంటుంది.

# వీళ్లదంతా ఒక ట్రెండు

**క**ళాకారుడి నటన కలకాలం నిలిచిపోవడానికి వందల సినిమాలు చేయాల్సిన పనిలేదు. దర్శకుడి ప్రతిభకు గీటురాయిగా సినిమాల లిస్టు అక్కర్లేదు. ఒక్క మంచి చిత్రం చాలు!! సంగీత దర్శకులు, గాయకులు, రచయితలు ఇలా ఎందరో రెండుమూడు సినిమాలతో మూడు తరాలు గుర్తుంచుకునేంత కీర్తి మూటగట్టుకున్నారు. వారిలో కొందరు మన టాలీవుడ్‌లో పుట్టిపెరిగిన వారైతే, ఇంకొందరు బాలీవుడ్ ప్రతిభాశాలురు. ఇలాగ వచ్చి.. అలాగ మెచ్చుకునేలా తమ సృజనను పంచారు.

**కొన్ని** దశాబ్దాలు వెనక్కి వెళ్తే.. 'సంతానం' సినిమాలోని 'నిదురపోరా తమ్ముడా.. నిదురపోరా తమ్ముడా..' పాట తెలుగువారిని నిద్రపుచ్చింది. బాలీవుడ్ పాటల కోట మహారాణి లతామంగేష్కర్ గళంలో మొదటిసారి తెలుగు తేనెలద్దుకున్నది ఈ పాటతోనే. 'నిదురలోన గతమునంతా నిముషమైనా మరచిపోరా..' అని ఆమె అన్నదే కానీ, లతమ్మ గాన మాధుర్యాన్ని నిదురలోనూ ఎలా మర్చిపోతాం? ఆ గాయనీమణి గానామృతంలో మరో రెండు తెలుగు పాటలు పరవళ్లు తొక్కాయి. 'దొరికితే దొంగలు' సినిమాలోని 'శ్రీ వేంకటేశా..' పాట భక్తి పారవశ్యాన్ని పంచింది. తర్వాత కొన్ని దశాబ్దాలకు 'ఆఖరి పోరాటం'లో 'తెల్లచీరకు తకధిమి తపనలు..' అని తెలుగు సిరిమల్లె పూలకు సరికొత్త సరిగమలు నేర్పింది. ఆపై లత తెలుగు పాటలు పాడిందీ లేదు. మనం మురిసిందీ లేదు!!

**బాలీవుడ్** గీతకారుల్లో మహమ్మద్ రఫీ తెలుగులో పదుల సంఖ్యలో పాటలు పాడారు. 'భలే తమ్ముడు', 'ఆరాధన', తల్లా పెళ్లామా?, తిరుపతి వేంకటేశ్వర కల్యాణం, 'అక్బర్ సలీం అనార్కలి' సినిమాల కోసం తెలుగులో గొంతు సవరించుకున్నారు. ఆ పాటలన్నీ సూపర్ హిట్టే! కానీ, బాలీవుడ్ సంగీత దర్శకులు ఇటుగా కన్నెత్తి చూసింది తక్కువే! ఎప్పటికో గానీ 1979లో బాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ సి.రామచంద్ర 'అక్బర్ సలీం అనార్కలి' చిత్రానికి సంగీతం అందించారు. 1988లో హిందీ చిత్రసీమ సంగీత దిగ్గజం 'ఓపీ నయ్యర్' తెలుగు సినిమాకు స్వరాలు కూర్చారు. 'నీరాజనం' సినిమా ప్రేక్షకుల ఆదరణకు అంతగా నోచుకోకున్నా.. అందులోని పాటలు నేటికీ నిత్యనూతనంగా వినిపిస్తూనే ఉంటాయి. 'నిను చూడక నేనుండలేను..', 'ఊహల ఊయలలో..', 'ఘల్లుఘల్లున గుండె జల్లన..' పాటలతోపాటు ఈ చిత్రంలోని గీతాలన్నీ ఎవర్‌గ్రీన్ హిట్స్ జాబితాలో చోటు దక్కించుకున్నవే! ఇదొక్కటే ఓపీ నయ్యర్ సంగీతం అందించిన తెలుగు సినిమా. అదే ఏడాది విడుదలైన 'చిన్నికృష్ణుడు' సినిమాతో ఆర్డీ బర్మన్ మొదటిసారిగా తెలుగు సినిమాకు స్వరాలు కూర్చారు. ఆ సినిమా టైటిల్స్‌లో 'ప్రప్రథమంగా తెలుగులో ఆర్డీ బర్మన్ సంగీత దర్శకత్వంలో' అని పేర్కొన్నారు కూడా! ఈ సినిమాలో 'జీవితం సప్తసాగర గీతం..' పాట బర్మన్ సాబ్ ప్రత్యేకతను నేటికీ చాటుతూనే ఉంటుంది. తర్వాత నాలుగేండ్లకు నాగార్జున హీరోగా వచ్చిన 'అంతం' సినిమాలో కొన్నిపాటలకు ఆయన సంగీతం అందించారు. మ్యూజిక్ డైరెక్టర్ రవి శంకర్ శర్మకు బాలీవుడ్‌లో లెజెండరీగా పేరుంది. ఆయన సంగీతం అందించిన ఏకైక తెలుగు చిత్రం వినీత్ హీరోగా వచ్చిన 'సరిగమలు'. ఈ సినిమాలోని పాటలన్నీ మెగాహిట్ సాధించినవే! 'సరిగమలాపవయా.. సరసకు చేరవయా', 'స్వరరాగ గంగా ప్రవాహమే.. ' పాటలు తరచూ రేడియోలో వినిపిస్తూనే ఉంటాయి.

**మాటల** రచయితగా.. పాటల దగ్గరికి వచ్చేసరికి మనుసు కవిగా.. తెలుగు ప్రేక్షకులను అలరించిన కవి ఆచార్య ఆత్రేయ. వందలాది సినిమాలకు మాటలు, వెయ్యికిపైగా పాటలు రాసిన ఆయన ఒకే ఒక సినిమాకు దర్శకత్వం వహించారు. ఏయన్నార్, కృష్ణకుమారి జంటగా వచ్చిన 'వాగ్దానం' ఆత్రేయ డైరెక్ట్ చేసిన తొలి, మలి చిత్రం. కమర్షియల్‌గా ఫెయిల్ అయినా మ్యూజికల్‌గా మంచి హిట్ అయింది! తను తొలిగా దర్శకత్వం వహిస్తున్న సినిమాలో అన్ని పాటలూ రాసే అవకాశం ఉన్నా.. ఇతర రచయితలకూ అవకాశం ఇవ్వడం గొప్ప విషయమే! ఇందులోని 'నా కంటిపాపలో నిలిచిపోరా.. నీ వెంట లోకాల గెలవనీరా' పాట దాశరథి కృష్ణమాచార్యకు మొదటి సినిమా గీతం. ఆత్రేయ కన్నా ముందువాడు, తెలుగు సినీకవుల్లో పేరెన్నికగన్నవాడు సీనియర్ సముద్రాల. ఆయన మూడు సినిమాలకు మెగాఫోన్ పట్టుకున్నారు. 'వినాయక చవితి', 'బభ్రువాహన', 'భక్త రఘునాథ్' సినిమాలకు ఆయన దర్శకత్వం వహించారు. దర్శకత్వంతో తమలోని కొత్త కోణాన్ని చూపించిన నటులు మహానటి సావిత్రి, విఖ్యాత నటుడు ఎస్వీ రంగారావు. 'మాతృదేవత', 'చిన్నారి పాపలు' సినిమాలకు సావిత్రి దర్శకత్వం వహించారు. 'బాంధవ్యాలు', 'చదరంగం' చిత్రాలను ఎస్వీయార్ డైరెక్ట్ చేశారు. తర్వాత చాలామంది నటులు చాలా సినిమాలకు దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. కానీ, ఒకటీ అరా సినిమాలతో అద్భుతః అనిపించుకున్నవారు కొందరే! కమెడియన్ ధర్మవరపు సుబ్రహ్మణ్యం బుల్లితెరపై ఎన్నో ధారావాహికలను డైరెక్ట్ చేశారు. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'తోకలేనిపిట్ట'. అంతగా ఆడకపోయినా.. ఈ సినిమా నవ్వులు పూయిస్తుంది.

> తెలుగు సాహిత్యంలో గుంటూరు శేషేంద్ర శర్మ లబ్ధప్రతిష్ఠుడు. వచన, పద్య కవిత్వాల్లో ఆయనకు ఆయనే సాటి అన్న పేరుంది. తెలుగు, ఆంగ్ల భాషల్లోనూ సమ ప్రజ్ఞ ఆయన సొంతం. అలాంటి కవిశ్రేష్ఠుడు తెలుగు సినిమా కోసం ఒకేఒక పాట రాశారు. బాపు దర్శకత్వంలో వచ్చిన 'ముత్యాలముగ్గు'లో 'నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది..' గీతం వారు రాసిందే! రెండు చరణాల్లో సినిమా కథనంతా రంగరించిన వైనం అద్భుతం అనిపిస్తుంది. 'నది దోచుకుపోతున్న నావను ఆపండి.. రేవు బావురుమంటుందని' పంక్తులు పక్కా సినిమా ప్రయోగం కాకున్నా.. పండితులనే కాదు.. పామరులనూ అలరించాయి.

**ఇలా** ఒకట్రెండు సినిమాలతో అద్భుతాలు ఆవిష్కరించిన వారు కొందరున్నారు. 'కోకిల' చిత్ర దర్శకుడు గీతాకృష్ణ నాలుగైదు సినిమాల్ని డైరెక్ట్ చేశాడు. మొదటి సినిమా 'సంకీర్తన'తో ఉత్తమ దర్శకుడిగా నంది పురస్కారం అందుకున్న ఆయన 'కోకిల'తో వినూత్న డైరెక్టర్ అన్న పేరు సాధించాడు. మహేశ్ బాబు నటించిన 'బాబీ'తో పరిచయమైన దర్శకుడు శోభన్. ఆయన రెండో చిత్రం 'వర్షం' ప్రభాస్‌ను సూపర్ హీరోగా నిలబెట్టింది. తర్వాత రవితేజ హీరోగా 'చంటి' సినిమా తీశారంతే! తర్వాత ఒక ట్రెండు సినిమాల్లో నటుడిగా అలరించి అకస్మాత్తుగా కన్నుమూశారు. సినిమాటోగ్రాఫర్‌గా రసూల్ ఎల్లోర్‌కు గొప్ప టెక్నీషియన్‌గా పేరుంది. ఆయన దర్శకత్వం వహించిన 'ఒకరికి ఒకరు', 'భగీరథ' రెండు చిత్రాలూ మంచి టాక్ తెచ్చుకున్నాయి.

# ఏం కావాలయ్యా మీకూ..?

**అందాలు** ఆరబోసే హీరోయిన్ల ఫొటోలకు ఆదరణ ఉండనిదెప్పుడు? ఓ సెలెబ్రిటీ పిక్ సోషల్ మీడియాలో ఇలా అప్‌లోడ్ అవ్వడంతోనే గంటల్లో మిలియన్ల వ్యూస్ వచ్చేస్తుంటాయి. ఫాలోవర్సూ, లవర్సూ మరీ ఇంతలా చూసేస్తుంటే ఫొటోగ్రాఫర్లు మాత్రం స్టిల్స్ కోసం ఎగబడకేం చేస్తారు? పాపం అలా లెన్స్ జూమ్ చేస్తూ కనిపించీ కనిపించనట్టుగా ఉన్న ఆ బాలీవుడ్ భామ అందాల్ని ఒడిసిపట్టేయాలని ప్రయత్నించిన ఫొటోగ్రాఫర్లకు మడతడిపోయింది. ఔను, బిగ్‌బాస్ (హిందీ) షో ఫేమ్ అయేషా ఖాన్ ఇటీవల స్టిల్ ఫొటోగ్రాఫర్లను తెగ తిట్టిపోసిందట. 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'లోని మోత.. లిరికల్ సాంగ్‌లో తన గ్లామర్‌తో అభిమానుల గుండెల్ని ఓ మోత మోగించింది సుందరి. ఈ సినిమా మేలో విడుదల కానుండగా, అయేషా ఖాన్ నటించిన మరో సినిమా 'ఓం భీమ్ బుష్' ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. ఈ రెండు సినిమాలతో తెలుగునాట పాపులర్ అయిన ఈ బ్యూటీ పబ్లిక్ ఈవెంట్లలో బిజీగా ఉంటున్నది. ఈ నేపథ్యంలో ఫొటోగ్రాఫర్లు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారంటూ వారిపై చిందులు వేసిందట. హద్దు మీరి సెలెబ్రిటీల ఫొటోలు తీస్తున్నారంటూ ఆరోపించింది. ఫొటోగ్రాఫర్ల అసభ్య ప్రవర్తన, అనుచిత కోణాల గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో వరుస పోస్టులతో చెలరేగిపోతున్నది. అమర్యాదగా ప్రశ్నిస్తారంటూ, అసౌకర్య క్షణాల్లో ఫొటోలు తీస్తారంటూ తప్పు పట్టింది. 'ఏమిటి ఈ యాంగిల్స్? ఎక్కడ జూమ్ చేస్తున్నారు? అనుమతి అక్కర్లేదా?!..' అంటూ ప్రశ్నించింది.

